క్లుప్తంగా

భవన పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

సోంపేట: పలాసపురం పంచాయతీ లక్కవరం గ్రామంలో అగ్నికుల క్షత్రియభవనాన్ని త్వరంగా పూర్తి చేస్తామని సర్పంచ్ తడక జోగారావు అన్నారు. శ్లాబ్ వేసే పనులను ఆదివారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు పోలాకి రమణమూర్తి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ


పరామర్శలో నాయకులు

సోంపేట: గొల్లూరు పంచాయతీ ఉపసర్పంచ్ తెప్పల సావిత్రి ఇటీవల మృతి చెందారు. ఆమె కుటుంబాన్ని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ ఆదివారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త గాదేటి అప్పన్న మృతి చెందడంత.. అతని కుటుంబాన్ని కూడా పరామర్శించారు. గొల్లూరు సర్పంచ్ పిన్నింటి ఈశ్వరరావు, పార్టీ నాయకులు పిన్నింటి రేఖారావు, కె.శ్రీను, జోగారావు, సోమయ్య, విశ్వనాథం, బెహరా రమేష్, చిత్రసేన ఉన్నారు.

జర్నలిస్ట్ కాలనీలో సమస్యల తిష్ట!


సౌకర్యాలకు నోచుకోని జర్నలిస్ట్ కాలనీ

ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి సంతపేటవద్ద ఉన్న జర్నలిస్ట్ కాలనీలో సమస్యలు తిష్ట వేశాయి. దీంతో ఇక్కడ నివసిస్తున్న సుమారు 150 కుటుంబాలు అవస్థలు పడుతున్నాయి. మంచినీరు, రోడ్లు, కాలువల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు. కాలనీకి సమీపంలోనే బాహుదా నది ఉన్నప్పటికీ అక్కడ నుంచి పైపులైన్‌ను మాత్రం ఏర్పాటు చేయకపోవడంతో నీటి కోసం పడరానిపాట్లు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లేక వాడుక నీరు రోడ్లపైకి వచ్చి చేరుతుండడంతో దోమలు, ఈగలు విజృంభించి రోగాలబారిన పడుతున్నామంటున్నారు. వీధుల్లో పక్కా రోడ్లు లేకపోవడంతో వర్షాకాలంలో నడిచి కూడా వెళ్లలేని పరిస్థితి. అధికారులు దృష్టిసారించి సదుపాయాలు కల్పించాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బస్సు కోసం అడిగితే..
కస్సుమంటున్నారు..!

- కానరాని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- బడ్జెట్‌లో కనీసం ప్రస్తావించని వైనం
- టెక్కలి నియోజకవర్గంలో ఎదురు చూస్తున్న 1,38,433 మంది మహిళలు


టెక్కలిలో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళలు

టెక్కలి: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎండమావిగా మారింది. అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణాలు కల్పిస్తామని ఎన్నికల ముందు కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ఈ హామీపై పలు సందర్భాల్లో ప్రస్తావిస్తే కూటమి నాయకులు తమపై కస్సుబుస్సు మంటున్నారని మహిళలు మండిపడుతున్నారు. అధికారం చేపట్టి పది నెలలు గడుస్తున్నప్పటికీ రెండు బడ్జెట్లలో కూడా దీనిపై కనీసం ప్రస్తావించకపోవడం గమనార్హం. గత నెలలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ పథకంపై పూర్తిగా ప్రస్తావన చేయలేదు. తాజాగా డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు సైతం ఉచిత బస్సు ప్రయాణంపై దాటవేసే వ్యాఖ్యలు చేయడంతో దీనిపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

1,38,433 మంది ఎదురుచూపులు...

కూటమి ప్రభుత్వం వస్తే ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చుననే మహిళల ఆశలు అడిఆసలయ్యాయి. ఈ పథకం కోసం టెక్కలి నియోజకవర్గంలో టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నందిగాం మండలాల్లో సుమారు 1,38,433 మంది మహిళలు ఎదురు చూస్తున్నారు. 2011 అధికార గణాంకాల ప్రకారం ఈ సంఖ్య ఉంది. క్షేత్రస్థాయిలో మాత్రం పెరిగే అవకాశం ఉంది. వీరంతా కూటమి ప్రభుత్వం ఎప్పుడు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తుందోనని వేచి చూస్తున్నారు.

ఎందుకు అమలు చేయడం లేదు?



కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడచినా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ఎందుకు అమలు చేయడం లేదు. సూపర్ సిక్స్ మేనిఫెస్టోలో ఈ పథకాన్ని ప్రధానంగా చేర్చి ఇప్పుడు అమలు చేయడంలో తాత్సారం చేస్తున్నారు. ఇది మహిళలను మోసం చేయడమే.

–గొండు చాందిని, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు, టెక్కలి

ఏం సమాధానం చెబుతారు..



కూటమి ప్రభుత్వంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంటూ ఎన్నికల మనుపు హామీ ఇచ్చారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సైతం దీని గురించి ప్రస్తావన చేయలేదు. ఉచిత బస్సు ప్రయాణం కోసం ఎదురుచూస్తున్న మహిళలకు కూటమి నాయకులు ఏం సమాధానం చెబుతారు.

–ఆర్.లక్ష్మీకాంతం, వైస్ ఎంపీపీ, నందిగాం

తక్షణమే పథకం అమలు చేయాలి



అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణం కల్పిస్తామని ఎన్నికల ముందు కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ఇప్పుడు హామీ అమలు చేయకపోగా దానిపై కనీసం మాట్లాడడం లేదు. ఉచిత బస్సు ప్రయాణం పేరుతో మహిళలను మోసం చేశారు. తక్షణమే ఈ పథకాన్ని అమలు చేయాలి.

–బి.దేవయాని, ఎంపీటీసీ సభ్యురాలు, సీతాపురం, టెక్కలి మండలం

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


టెక్కలి: బీజేపీ ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు


కాశీబుగ్గ: బీజేపీ జెండా ఆవిష్కరణలో నాయకులు

టెక్కలి: గ్రామస్థాయి నుంచి పార్టీ పరిష్టతకు కృషి చేయాలని బీజేపీ జిల్లా నాయకుడు బి.ఉమామహేశ్వరరావు కోరారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని టెక్కలిలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం మోదీ సర్కార్ చేస్తున్న అభివృద్ధిని వివరించారు. పార్టీ మండల అధ్యక్షుడు జె.రామ్‌జీ, నాయకులు ఎన్.లక్ష్మీనారాయణ, జి.మీనాకుమార్, బి.నరేంద్ర పాల్గొన్నారు.

కాశీబుగ్గ: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పలాసలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పార్టీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. జిల్లా కన్వీనర్ రామానందస్వామి, నాయకులు పాలవలస వైకుంఠరావు, పైల రాజారత్నం నాయుడు, పట్టణ అధ్యక్షులు చిన్నికృష్ణ, రూరల్ అధ్యక్షులు మామిడి ప్రసాదరావు పాల్గొన్నారు.

23, 24 తేదీల్లో కరగాం జాతర


బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

నరసన్నపేట: ఈ నెల 23, 24వ తేదీల్లో మండలంలోని కరగాం గ్రామంలో గల షిరిడీ సాయిబాబా గుడి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. ఈ మేరకు గ్రామ అమ్మవారి గుడి వద్ద గోడ పత్రికలు, బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉచిత మెడికల్ క్యాంప్, తిరువీధి, పారాయణం, భజనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, 24న అన్న సంతర్పణ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఆకట్టుకున్న గణిత అవధానం



సోంపేట పట్టణం విద్యార్థులతో గణిత అవధాని మద్దు తిరుపతిరావు ఆదివారం నిర్వహించిన గణిత దశ అవధానం అబ్బురపరిచింది. విద్యార్థులు పృచ్ఛకులుగా వ్యవహరిస్తూ గణితంలో వివిధ అంశాలైన ఘనమూలాలు, సమస్యాపురాణం, పంచమమూలాలు,మనోసంకలనం, వారగణన, దత్తభిన్నాంకం తదితర అంశాలపై అడిగిన ప్రశ్నలకు అవధాని క్షణాల్లో సమాధానం చెప్పి ఆశ్చర్యపరిచారు. విద్యార్థులకు గణితంపై అవగాహన కల్పించారు. గణిత అవధానిని విద్యార్థులు, ఉపాధ్యాయులు దుశ్శాలువతో సత్కరించారు. –సోంపేట

ధనరాజులమ్మకు పూజలు



ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టిలో పూజలందుకుంటున్న ధనరాజుల తులసమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మేళతాళాలతో అమ్మవారి గజముద్దను ఊరేగించిన భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. –ఇచ్ఛాపురం రూరల్

'ఆపరేషన్ కగార్'కు వ్యతిరేకంగా..



కాశీబుగ్గలో ఈ నెల పదో తేదీన ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా నిర్వహించనున్న సదస్సను జయప్రదం చేయలాని సీపీఐ నాయకులు కోరారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను కాశీబుగ్గలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఆవిష్కరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ సర్కార్ కార్పొరేట్లకు వత్తాసు పలుకుతూ అడవుల్లో ఉండే ఖనిజ సంపదను వారికి కట్టబెట్టే చర్యలో భాగంగా మావోయిస్టుల పేరుతో ఆదివాసీలను కిరాతకంగా చంపే చర్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతినిధులు చాపర వేణుగోపాల్, మద్దిల రామారావు, వంకల మాధవరావు, పత్రి దానేసు, కొర్రాయి నీలకంఠం, పుచ్చ దుర్యోధన పాల్గొన్నారు. –కాశీబుగ్గ

ఘనంగా ఉత్కళాంధ్ర కవి సమ్మేళనం

పలాస: పలాసలోని లయన్స్‌క్లబ్ ఆవరణలో ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా ఉత్కళాంధ్ర కవి సమ్మేళం ఘనంగా జరిగింది. జనజాగృతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కుమార్ నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి మాట్లాడుతూ.. సాహిత్యాన్ని సజీవంగా ఉంచాలని, ప్రజాహిత లక్ష్యంగా సాగాలన్నారు. ఆ లక్ష్యంతోనే ఇటువంటి కార్యక్రమాలను సంస్థ నిర్వహిస్తుందన్నారు. ఇది 75వ కార్యక్రమమన్నారు. సంస్థ విధి విధానాలను వివరించారు. ముఖ్యఅతిథులుగా వచ్చిన తెలుగు రచయితల వేదిక అధ్యక్షుడు ఉత్తరవల్లి నాగేశ్వరరావు, లయన్స్‌క్లబ్ రీజన్ వన్ చైర్‌పర్సన్ ఉన్న వెంకట రంగనాథం, ప్రముఖ కవి నిశితాసి లయన్ సిందిరి మధుసూదనరావు, లయన్ కోదండరామయ్యలను జన జాగృతి సభ్యులు ఘనంగా సన్మానించారు. కుమారి భాష్యం లక్ష్య శాస్త్రీయ నృత్యాన్ని, బాలక లోకనాథం హాస్యవల్లరి, మంగలి దండాశి


మాట్లాడుతున్న డాక్టర్ కుమార్‌నాయక్

ఏకపాత్రాభినయం ఆహూతులను అలరించింది. బమ్మిడి సుబ్బారావు నిర్వహణలో సమకాలీన సామాజిక అంశాలపై స్వీయ కవితా పఠనం జరిగింది. ఇందులో 34 మంది కవులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పలాస-కాశీబుగ్గ లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు హెచ్.వై.దొర, ఎస్.అప్పారావు, కార్యదర్శులు బి.బాలరాజు, ఉమామహేశ్వరి, భాష్యం రవికుమార్, జయంతి గజలక్ష్మి, చిట్టిబాబు ఉన్నారు.

కమనీయం..సీతారాముల కల్యాణం..

పచ్చటిపందిళ్లు..స్వాగత తోరణాలు..విద్యుత్‌దీపాల వెలుగులు.. ఊరూరా ఆదివారం కనిపించిన సుందర దృశ్యాలివి. శ్రీరామ నవమి ఉత్సవానికి పల్లెలు..పట్టణాలు వేదికలయ్యాయి. వీధులు..ఆలయాలు శ్రీరామ నామస్మరణతో మారుమోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. సీతారామ లక్ష్మణులను దర్శించుకోవడానికి భక్తులు పోటీపడ్డారు. ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. భాజాభజంత్రీలు, వేదమంత్రోచ్ఛరణాల మధ్య ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కల్యాణాన్ని కమనీయంగా పండితులు నిర్వహించగా ఈ సుందర దృశ్యాన్ని భక్తులు కనులారా వీక్షించి పరశించిపోయారు. తీర్థప్రసాదాలు, పానకలను స్వీకరించారు. పలు గ్రామాల్లో శోభాయాత్రను నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. –సాక్షి నెట్‌వర్క్


సంతబొమ్మాళి: దండుగోపాలపురంలో పూజలందుకున్న ఉత్సవమూర్తులు


టెక్కలి: రోటరీనగర్‌లోని శాంతి సుధా మందిరంలో సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తజనం


ఇచ్ఛాపురం: కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ ఘట్టం


కంచిలి: తలతంపర గ్రామ బస్టాండు వద్ద పూజలందుకున్న ఉత్సవమూర్తులు


కంచిలిలో శ్రీరామనవమి పూజల్లో ఎమ్మెల్సీ నర్తు రామారావు, చామంతి దంపతులు


టెక్కలి: గోపినాథపురం శ్రీరామ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


మందస: వాసుదేవుని పేరూమాళ్ ఆలయంలో పూజలు నిర్వహిస్తూ..


పలాస:అంబేడ్కర్‌నగర్‌ని శ్రీరామఅభయాంజనేయస్వామి దేవాలయంలో ప్రసాదాలను పంపిణీ చేస్తూ..


వజ్రపుకొత్తూరు రూరల్: పల్లిసారథిలో సీతారాములు కల్యాణం


వజ్రపుకొత్తూరు రూరల్: దోకులపాడులో పూజలు చేస్తున్న భక్తులు


వజ్రపుకొత్తూరు రూరల్: సీతాపురంలో అదర్శమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు


వజ్రపుకొత్తూరు: పాతటెక్కలిలోని సీతారామ ఆలయానికి పోటెత్తిన భక్తులు


కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ రోడ్డు రామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష


సోంపేట: పట్టణంలో పూజలందుకున్న కోదండరామస్వామి


కవిటి: సీతారాముల కల్యాణ పూజల్లో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, జెడ్పీ చైర్‌పర్సన్ విజయ దంపతులు


కవిటి: డొంకపుట్టుగలో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు


ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురంలో సీతారాములను దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్ బెందాళం అశోక్


ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురంలో సీతారాముల విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

వ్యవసాయ పనిముట్లకు తుప్పు!


మూలకు చేరిన వరినాట్లు వేసే వాహనం


తుప్పు పట్టిన వరినాట్లు వేసే యంత్రం


తుప్పు పట్టిన రోటోవేటర్

ఇచ్ఛాపురం రూరల్: రాజుల సొమ్ము రాళ్లపాలు అన్నట్లు ప్రభుత్వం సొమ్ముతో కొనుగోలు చేసిన వ్యవసాయ పనిముట్లు తుప్పుపట్టి మూలకు చేరాయి. స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్) రైతుల అవసరాల కోసం గతంలో లక్షలాది రూపాయలు వెచ్చించి వ్యవసాయ పనిముట్లు కొనుగోలు చేసింది. అందులో 2011వ సంవత్సరంలో రూ.26 లక్షలతో కొనుగోలు చేసిన వరినాట్లు వేసే భారీ యంత్రంతో పాటు తర్వాత కొనుగోలు చేసిన దుక్కు యంత్రాలు, నాగళ్లు పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో తుప్పల్లో తుప్పు పట్టుకుపోతున్నాయి. వీటిని వినియోగంలోకి తేవాలన్న ఆలోచన సంబంధిత శాఖాధికారులకు లేకపోవడాన్ని రైతులు తప్పుపడుతున్నారు. ఈ విషయాన్ని పీఏసీఎస్ సీఈఓ భుజంగరావు వద్ద ప్రస్తావించగా.. తాను బదిలీపై కార్యాలయానికి వచ్చే సమయానికి ఈ యంత్రాలు మూలకు చేరాయన్నారు. వీటిని వినియోగంలోకి తెచ్చే ఆలోచన తమకు లేదని స్పష్టం చేశారు.